సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 28 । సెప్టెంబర్ । 2024



పారిశుద్ధ్య కార్మికుల రక్షణ గాలికి

పారిశుద్ధ్య కార్మికుల రక్షణను ప్రభుత్వం గాలికొదిలేసింది. రోడ్లు ఊడ్చేందుకు మొక్కుబడిగా చీపుర్లు ఇస్తున్నా చేతికి గ్లౌజులు, చెప్పులు, మాస్క్ ఇవ్వడం లేదు. 8లో ▸



వరిపై ఎండాకు తెగులు

భారీ వర్షాలు, వరదల కారణంగా సార్వాను ఎండాకు తెగులు ఆశించింది. నీటిద్వారా ఇతర పొలాలకు వ్యాపించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 8లో ▸



డెంగీ మృతిపై విచారణ

ఇటీవల అత్తిలికి చెందిన యువకుడు డెంగీతో మృతి చెందడంతో అధికారులు తణుకులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో వివరాలు సేకరించారు. 8లో ▸

కూటమిలో నామినేటెడ్ చిచ్చు

- ఉమ్మడి పశ్చిమలో జనసేనకు మొండిచేయి
- ఆరుగురు ఎమ్మెల్యేలు ఉన్నా ఒక్క పదవీ దక్కని వైనం
- జనసేన శ్రేణుల్లో అసమ్మతి.. ఇప్పటికే పట్టించుకోని టీడీపీ ఎమ్మెల్యేలు
- ప్రాధాన్యం లేక, పదవులు దక్కక నేతల్లో అంతర్మథనం



సాక్షి ప్రతినిధి, ఏలూరు: చంద్రబాబును అందలం ఎక్కించడం కోసం జనసేన నేతలు, కార్యకర్తలు కష్టిస్తే ఇప్పుడు తమను పరిగణనలోకి తీసుకోవడం లేదని అసంతృప్తితో రగిలిపోతున్నారు. నియోజకవర్గంలో మాట చెల్లుబాటు కావడం లేదు.... ఎమ్మెల్యేలు కనీసం పట్టించుకోవడం లేదు.. మనం త్యాగం చేసి.. వాళ్ళని పల్లకి ఎక్కిస్తే పట్టించుకోవడం లేదని తీవ్ర అంతర్మథనం చెందుతున్నారు. ఎన్నికల్లో త్యాగం చేస్తే కనీసం నామినేటెడ్ పదవులకు కూడా తమను పరిగణనలోకి తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా నామినేట్ పదవులు ప్రకటన ఉమ్మడి పశ్చిమలో ముఖ్యంగా జనసేనలో చిచ్చురేపింది. రూ.కోట్లు ఖర్చు పెట్టి, ఏళ్ళ తరబడి పార్టీ జెండా మోసినా పట్టించుకోరా? అంటూ బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మూడూ టీడీపీ నేతలకే..

కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వంద రోజులు తరువాత నామినేట్ నియామకాలు జరిగాయి. 20 నామినేట్ పోస్టులు రాష్ట్ర స్థాయిలో ప్రకటిస్తే మూడు పదవులు ఉమ్మడి పశ్చిమకు దక్కాయి. మూడు కూడా టీడీపీ నేతలకే రావడంతో జనసేన ముఖ్యనేతలు అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఏలూరు జిల్లాకు సంబంధించి పోలవరం టీడీపీ నేత బొరగం శ్రీనివాస్‌కు ఏపీ ట్రైకార్డ్ చైర్మన్ పదవి దక్కగా పశ్చిమగోదావరి జిల్లా కోటాలో మాజీ మంత్రి పీతల సుజాతకు వినియోగదారుల ప్రొటెక్షన్ కౌన్సిల్ చైర్మన్ పదవులు, ఉండి మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజుకు ఏపీఐఐసీ చైర్మన్ పదవి దక్కాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో జనసేనకు నియోజకవర్గ ఇన్‌చార్జులతోపాటు కీలక నేతలు, అలాగే బీజేపీకి కొందరు నేతలు జిల్లాలో ఉన్నారు. ఎక్కువ మంది నేతలకు ఎమ్మెల్సీలు, కీలక నామినేట్‌లు ఇస్తామని ప్రకటించారు. కార్యాచరణలో మాత్రం ఎక్కడా అమలు కాలేదు.

చిన్నచూపు చూస్తున్నారు
జనసేన నేతలు

టీడీపీ ఎమ్మెల్యేలు గెలిచిన చోట జనసేన నేతలకు విలువ లేకుండా పోయింది. ఎన్నికల సమయంలో ప్రచారానికి వినియోగించి తరువాత పూర్తి ప్రాధాన్యత తగ్గించడంతో పాటు మాట కూడా చెల్లుబాటు కాకుండా చేయడంతో అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఏలూరు, దెందులూరు, చింతలపూడి, పోలవరం, ఉండి, తణుకు నియోజకవర్గాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. మరోవైపు పోలవరంలో జనసేన ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు సమాంతరంగా టీడీపీ నియోజకవర్గనేత బొరగం శ్రీనివాస్‌కు నామినేటెడ్ పదవి కట్టబెట్టడంపై జనసేన ఎమ్మెల్యేకు పొగబెట్టారంటూ పార్టీ శ్రేణులే బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరిలో చాలా నియోజకవర్గాల్లో టీడీపీ ఎమ్మెల్యేలు జనసేన కేడర్‌ను పట్టించుకోవడం లేదు. మరోవైపు నామినేట్ పదవుల్లో జనసేనకు మొండిచేయి చూపడంతో అసమ్మతి సెగలు కొనసాగుతున్నాయి.

త్యాగం చేస్తే.. కనీసం పట్టించుకోరా ?

ఉమ్మడి పశ్చిమలో జనసేనకు సంబంధించి ఆరుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. బీజేపీకి ఒక ఎమ్మెల్యే, ఒక ఎంపీ ఉన్నారు. ఈ పరిణామాల క్రమంలో జిల్లాలో జనసేన సీట్ల ప్రాధాన్యత క్రమంలో పదవులు ఇవ్వాలనే డిమాండ్ గతంలోనే బలంగా తెరపైకి తెచ్చారు. పూర్తి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు. ఏలూరు జిల్లాలో రెడ్డి అప్పలనాయుడు, ఘంటా వెంకటలక్ష్మి, కొఠారు ఆదిశేషు, ఈశ్వరయ్య, నారా శేషుతో పాటు పలువురు ముఖ్యనేతలు పదవులు ఆశిస్తూ జనసేన కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో కొటికలపూడి గోవిందరావు, గుండా జయప్రకాష్‌నాయుడు, విరివాడ రామచంద్రరావు ఇలా అనేక మంది నేతలు పదవులు ఆశిస్తున్నారు. ఒక్కరిని కూడా కనీసం పరిగణనలోకి తీసుకోకపోవడంతో శ్రేణులు పూర్తిగా రగిలిపోతున్నాయి. ఏళ్ళ తరబడి పార్టీని నమ్ముకుని కోట్లు ఖర్చుపెడితే, చివరికి సీట్లు త్యాగం చేసినా కనీస గౌరవం కూడా ఇవ్వలేదని వాపోతున్నారు. ఇప్పుడు కేడర్‌కు ఏం చెప్పాలంటూ కొందరు నేతలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

న్యూస్‌రీల్

డ్వామా పీడీగా అప్పారావు



డ్వామా పీడీగా బాధ్యతలు స్వీకరిస్తున్న కేసీహెచ్ అప్పారావు

భీమవరం(ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి జిల్లా గ్రామీణ నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) సంచాలకులుగా డాక్టర్ కేసీహెచ్ అప్పారావు శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు డ్వామా పీడీగా పనిచేసిన ఎం.ప్రభాకర్‌రావు తాడేపల్లిగూడెం డివిజన్ అభివృద్ధి అధికారిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జిల్లా గ్రామ, వార్డు సచివాలయం అధికారిగా పనిచేస్తున్న అప్పారావు బదిలీపై డ్వామా పీడీగా వచ్చారు.

జిల్లా ప్రజా రవాణా అధికారిగా వరప్రసాద్



జిల్లా ప్రజా రవాణా అధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎన్‌వీఆర్ వరప్రసాద్

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లా ప్రజా రవాణా శాఖ(ఆర్టీసీ) అధికారిగా ఎన్‌వీఆర్ వరప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమ గోదావరి జిల్లా డీపీటీఓగా పనిచేసిన వీరయ్య చౌదరి రిటైర్ కావడంతో ఏలూరు డీపీటీఓగా పనిచేస్తున్న ఎన్‌వీఆర్ వరప్రసాద్ బదిలీపై జిల్లా డీపీటీఓగా వచ్చారు. కార్యక్రమంలో పర్సనల్ ఆఫీసర్ ఎల్.గీతా వాణి, నరసాపురం డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్న రెడ్డి, తణుకు డిపో మేనేజర్ ఎస్.గిరిధర్ కుమార్, తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ వై.సత్యనారాయణమూర్తి, భీమవరం డిపో అసిస్టెంట్ మేనేజర్ వై.సురేష్, జిల్లా అకౌంట్స్ ఆఫీసర్ ఎస్వీ రావు, షెడ్యూల్ సెల్ ఇంచార్జ్ ఆర్.బాలసుబ్రహ్మణ్యం, పీఆర్‌ఓ రావి రవికుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఎస్ఈ బాధ్యతల స్వీకరణ



భీమవరంలో రఘునాథ్‌బాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

భీమవరం: ఏపీఈపీడీసీఎల్ భీమవరం సర్కిల్ ఎస్ఈగా ఎ.రఘునాథ్‌బాబు శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. రఘునాథ్ బాబుకు భీమవరం డీఈ వెంకటేశ్వరరావు, యూనియన్ నాయకులు, కాంట్రాక్టర్లు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

గాంధీ స్మారక అవార్డులకు ఆరుగురు ఎంపిక

భీమవరం: మహాత్మాగాంధీ 156వ జయంతిని పురస్కరించుకుని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఆరుగురు గాంధేయవాదులు, సేవాతత్పరులను గాంధీస్మారక అవార్డులకు ఎంపిక చేసినట్లు సర్వోదయ మండలి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు శుక్రవారం చెప్పారు. ఎంపికైన వారిలో తుమ్మలపల్లి శివ(భీమవరం), కొండ్రెడ్డి సర్వేశ్వరరావు (ఉంగుటూరు), పెన్మెత్స రామ్మోహనవర్మ (చింత పర్రు), లంకసాని సత్యనారాయణ(మల్లవరం), రుద్రరాజు బంగార్రాజు(పత్తేపురం), డాక్టర్ కామిశెట్టి లలితాంబ(వల్లివేరు) ఉన్నారని అక్టోబర్ 2న పురస్కారాలు అందచేస్తామన్నారు.

మున్సిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ నాయకులు శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై గతంలో అనేక సార్లు వినతిపత్రం ఇచ్చినప్పటికీ.. సమస్యలు పరిష్కరించలేదని అందువల్లే ఆందోళన తీవ్రతరం చేశామన్నారు. మున్సిపల్ హైస్కూళ్లో తగినంత మంది సబ్జెక్ట్ టీచర్లను నియమించేలా ఎస్జీటీ, పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. నవంబర్‌లోగా అప్‌గ్రేడ్ పోస్టులలో మున్సిపల్ టీచర్లకు ప్రమోషన్ ఇవ్వాలని, మున్సిపల్ ప్రధానోపాధ్యాయుల్లో అర్హులైన వారిని అర్బన్ ఎంఈఓగా నియమించాలని కోరారు.

శాంతి స్థాపనలో టూరిజం కీలకం

జిల్లా పర్యాటక శాఖ మేనేజర్ కేఎస్ ప్రభాకరరావు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న టూరిజం మేనేజర్, ఇతర సిబ్బంది

తణుకు టౌన్: దేశాల మధ్య శాంతి స్థాపనలో పర్యాటకం కీలక పాత్ర వహిస్తుందని జిల్లా పర్యాటక శాఖ మేనేజర్ కేఎస్ ప్రభాకరరావు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో ప్రపంచ పర్యాటకం, స్వచ్ఛత అనే అంశంపై అవగాహనా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీసుందరిబాయి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక రంగాన్ని ప్రోత్సాహించాలని, పర్యటించే ప్రాంతాల్లో స్వచ్ఛత పాటించాలని సూచించారు. జిల్లా టూరిజం కరపత్రాలు విడుదల చేశారు. టూరిజంపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన, క్విజ్, పోస్టర్ పెయింటింగ్, షార్ట్ ఫిల్మ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. టూరిజం మేనేజర్ ఎస్.పట్టాభిరామన్, సూపరింటెండెంట్ జాన్ కెనడీ, టీ సత్యనారాయణ, జీ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వాలో కొత్త టెక్నాలజీ అందిపుచ్చుకోవాలి



ఆక్వా ఎక్స్‌పో ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగరాణి

ఉండి: ఆక్వా సాగులో రైతు మెలకువలు నేర్చుకుని నాణ్యమైన ఉత్పత్తులు సాధించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం ఉండి మండలం వాండ్రం పరిధిలోని కోట్ల ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన ఎక్స్‌పో–2024ను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం వివిధ స్టాల్స్ పరిశీలించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆక్వారంగాభివృద్ధి కోసం నిర్వహిస్తున్న ఎక్స్‌పోను ఉపయోగించుకోవాలన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా టెక్నాలజీని ఆక్వా రైతులు అందిపుచ్చుకోవాలని అన్నారు. మంచి ఉత్పత్తి రాబట్టేందుకు అందుబాటులో ఉన్న సేవలను వినియోగించుకోవాలన్నారు. ఆక్వా రంగ నిపుణులతో రైతుల ముఖాముఖీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు, మాజీ ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎంపెడా డిప్యూటీ డైరెక్టర్ టీజీ మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

భీమవరం పోలీసు సబ్ డివిజన్‌లో 30 యాక్ట్

భీమవరం: భీమవరం పోలీసు సబ్ డివిజన్ ప్రాంతంలో 30 పోలీసు యాక్టు అమలులో ఉన్నందున అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించవద్దని భీమవరం డీఎస్పీ ఆర్జీ జయసూర్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాళ్ల మండలం ఏలూరుపాడులో జరిగిన సంఘటనల దృష్ట్యా స్థానిక తహసీల్దార్ 144 సెక్షన్ విధించారని అందువల్ల నలుగురి కంటే ఎక్కువ మంది గుమిగూడి ఉండకూడదని నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రఘురామకృష్ణరాజుపై అట్రాసిటీ కేసు పెట్టాలి



భీమవరం అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం




ఏలూరు బార్ అసోసియేషన్‌లో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులు

భీమవరం: ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం భీమవరం అంబేడ్కర్ సెంటర్‌లో యునైటెడ్ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా భీమవరం అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నేతల సుందర్రాజు, పరువు విజయ్‌కుమార్‌బాబు మాట్లాడుతూ అంబేడ్కర్ చిత్రపటం పట్ల ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అనుచితంగా ప్రవర్తించడం దారుణమన్నారు. అంబేడ్కర్‌ను అవమానించిన ఎమ్మెల్యేపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కాటం స్టాన్లీరాజు, బదుగు అశోక్‌బాబు, డీకేవీ ప్రకాష్, తాళ్లూరి మధు, రొక్కల సుబ్బయ్య, దానం విద్యాసాగర్, నల్లాబత్తుల బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరులో..

ఏలూరు (టూటౌన్): ఉండి నియోజకవర్గంలోని కాళ్ల మండలం ఏలూరుపాడులో బీఆర్ అంబేడ్కర్ **ఫ్లెక్సీని చించి వేసి అంబేడ్కర్‌ను అవమానించిన** స్థానిక ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజును తక్షణం అరెస్టుచేయాలని ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ వద్ద శుక్రవారం జరిగిన సమావేశంలో ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పయనం రత్నరాజు రఘురామ కృష్ణంరాజు చర్యలను తీవ్రంగా ఖండించారు. కాకినాడలో దళిత డాక్టర్‌పై కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ దాడి చేసి కొట్టడం హేయమైన చర్య అని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు రఘురామ కృష్ణరాజు, పంతం నానాజీలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.తిరుపతి స్వామి, కోశాధికారి ఏ.మణికుమార్, మాజీ అధ్యక్షుడు కె.రాజబాబు, బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ నోముల రాముడు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ దోపిడీ



సాక్షి నెట్‌వర్క్: 'వైద్యో నారాయణో హరి' మాటను మరిచి జిల్లాలోని కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు ఫీజుల మోత మోగిస్తున్నాయి. ఓపీ నుంచి రూమ్ అద్దెలు, టెస్టులు, మందుల పేరుతో భారీగా వసూలు చేస్తున్నాయి. అత్యవసర కేసుల విషయంలో ఈ దోపిడీకి అడ్డూ అదుపూ ఉండటం లేదు. ముఖ్యంగా ఆరోగ్యశ్రీలో ఉచిత వైద్యం వర్తించని కేసులు విషయంలో ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పేదలు తమ వారి ప్రాణాలు కాపాడుకునేందుకు వైద్యులు అడిగినంతా చెల్లిస్తున్నారు. అలాగే కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యం, వైద్యులు సిండికేట్‌గా మారి మరీ ఫీజులు వసూలు చేస్తున్నారు.

కాసుపత్రులు

- ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఫీజుల మోత
- అత్యవసర వైద్యానికి మరింతగా..
- ఓపీ కార్డు నుంచి రూమ్ అద్దెల వరకూ అదేతీరు
- రోజుకు ఐసీయూ ఫీజు రూ.8 వేల నుంచి రూ.15 వేలు
- పాలకొల్లులో నిలిచిన ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణం
- పేదలకు ఉన్నత వైద్యం మరింత దూరం

ఓపీ కార్డు మొదలు..

ఓపీ కార్డు ఫీజు రూ.300 నుంచి రూ.500 వరకు ఉంది. అత్యవసర కేసులకు రూ. 1,000 వసూలు చేస్తున్నారు. వైద్య పరీక్షలకు బయట ల్యాబ్‌ల కంటే ఆస్పత్రుల్లోనే 50 శాతం అధికంగా చార్జీ చేస్తున్నారు. ఓ చోట రూ.500 ఉంటే మరోచోట రూ.1,000 చొప్పున ఉంటుంది. అలాగే ఇన్‌పేషెంట్ రూమ్ అద్దె రోజుకు రూ.3 వేల నుంచి ఏసీ గదికి రూ.5 వేల చొప్పున వసూలు చేస్తున్నారు. ఐసీయూ బిల్లు కూడా అదేస్థాయిలో ఉంటోంది. ఆస్పత్రిని బట్టి రోజుకు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు ఉంది. ఇలా ఓ రోజుకు అన్నిరకాల బిల్లులు కలిపి రూ. 10 వేల నుంచి రూ.15 వేల వరకు వసూలు చేస్తున్నారు. చిన్నపాటి శస్త్రచికిత్సకు కూడా రూ.30 వేల నుంచి రూ.50 వేలు ఖర్చవుతోంది.

మందుల్లోనూ దోచేస్తున్నారు

ఆస్పత్రిలోని మెడికల్ షాపుల్లో మందుల ధరలూ అధికంగా ఉన్నాయి. బయట షాపులతో పోలిస్తే రెట్టింపు ధరలు వసూలు చేస్తున్నారు. కొన్నిరకాల మందులు ఆస్పత్రిలోని షాపుల్లోనే లభించడంతో తప్పనిసరై ఇక్కడ కొనుగోలు చేయాల్సి వస్తుందని పేదలు అంటున్నారు.

భీమవరంలో మరింత దారుణం

జిల్లా కేంద్రం భీమవరంలో అన్ని రకాల సెష్పలిస్టు, మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు ఉన్నాయి. జిల్లాలోని అన్ని ప్రాంతాలతో పాటు కృష్ణా జిల్లా నుంచి ఇక్కడకు వైద్యం కోసం వస్తుంటారు. భీమవరంలోని కొన్ని ఆస్పత్రుల్లో ఫీజులు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో ఫీజుల కంటే ఎక్కువగానే ఉన్నాయి.

పట్టించుకోని అధికారులు

ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఫీజుల నియంత్రణపై వైద్యారోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కొన్ని ఆస్పత్రుల్లో ఫీజుల వివరాలు, ల్యాబ్ పరీక్షల ధరలు, ఐసీయూ ధరలు పట్టికలను ప్రదర్శించడం లేదు. మరికొన్ని ఆస్పత్రుల్లో ఉన్న సౌకర్యాలకు వసూలు చేస్తున్న ఫీజులకు పొంతన ఉండటం లేదు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్య కళాశాలతో పేదలకు భరోసా


గత జగన్ సర్కారులో పాలకొల్లు మండలం దగ్గులూరులో ప్రభుత్వ వైద్య కళాశాల మంజూరు చేశారు. పేదలకు అన్ని రకాల వైద్య సేవలు ఉచితంగా అందాలనే ఉద్దేశంతో రూ.475 కోట్ల నిధులు కేటాయించారు. గత ప్రభుత్వంలో కళాశాల నిర్మాణం కూడా ప్రారంభమైంది. మెడికల్ కాలేజీ తమకు భరోసాగా ఉంటుందని ఈ ప్రాంత ప్రజలు భావించారు. అయితే కూటమి ప్రభుత్వం ప్రభుత్వ వైద్య కళాశాలలపై కత్తి కట్టింది. రాజకీయ కక్షలతో గత ప్రభుత్వంలో చేపట్టిన నిర్మాణాలపై శీతకన్ను వేసింది. ఈ క్రమంలో దగ్గులూరులో వైద్య కళాశాల నిర్మాణాలు నిలిచిపోయాయి. ఉచితంగా ఉన్నత వైద్యం పొందేందుకు ఈ ప్రాంత ప్రజలు ఏలూరు లేదా కాకినాడకు వెళ్లాల్సి వస్తుంది. స్థానికంగా మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తయితే తమ ఆరోగ్యానికి కొండంత అండగా ఉంటుందని ప్రజలు అంటున్నారు.

మెడికల్ కాలేజీ పూర్తి చేయాలి



ఆరోగ్యశ్రీలో వర్తించని కేసులకు సంబంధించి ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఫీజులు భారీగా ఉంటున్నాయి. అత్యవసర వైద్యం అందించాల్సిన సమయంలో పేద, మధ్య తరగతి ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. గత ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్ ప్రజలకు అన్నిరకాల వైద్య సేవలు స్థానికంగా అందాలనే లక్ష్యంతో దగ్గులూరులో మెడికల్ కళాశాల నిర్మాణం తలపెట్టారు. ఈ కాలేజీ నిర్మాణం పూర్తయితే పేదల ఆరోగ్యానికి భరోసాగా ఉంటుంది.
– బి.రాంబాబు, కొండేపూడి

ఫీజుల పట్టిక ప్రదర్శించాలి



జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఫీజుల వివరాలను తెలిపేలా బోర్డును ప్రదర్శించాలి. ఎక్కడైనా ఆస్పత్రులపై ఫిర్యాదులు వస్తే వెంటనే విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటాం.
– డి.మహేశ్వరరావు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి

3 నుంచి దసరా మహోత్సవాలు



దసరా పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశంచౌక్): శ్రీమావుళ్ళమ్మ దసరా మహోత్సవాలు వచ్చే నెల 3 నుంచి 12 వరకు జరుగుతాయని, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. క్యాంపు కార్యాలయంలో శరన్నవరాత్రి మహోత్సవాల బ్రోచర్, పుస్తకాలు ఎమ్మెల్యే అంజిబాబు ఆవిష్కరించారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జునశర్మ వేద ఆశీర్వచనాలు చేసి బ్రోచర్, పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్ మాట్లాడుతూ వచ్చే నెల 3 నుంచి 12 వరకు ఆలయంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నామని, అమ్మవారికి 3న శ్రీసువర్ణ రజిత కవచాలంకరణ, 4న బాల త్రిపురసుందరీ దేవి, 5న గాయత్రి దేవి, 6న అన్నపూర్ణ దేవి, 7న మహాలక్ష్మి దేవి, 8న లలితా త్రిపుర సుందరీ దేవి, 9న సరస్వతీ దేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసుర మర్దిని, 12న రాజ రాజేశ్వరి దేవి అలంకరణ చేస్తామని, 12న మధ్యాహ్నం 1.05 నిమిషాలకు గ్రామోత్సవం, 14న అన్న సమారాధనను ప్రారంభిస్తారని తెలిపారు.

క్లుప్తంగా

గూడెం ఆర్డీఓగా భవానీ శంకరి



తాడేపల్లిగూడెం : గూడెం ఆర్డీఓగా భవానీ శంకరిని నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇప్పటివరకు ఇక్కడ ఆర్డీఓగా పనిచేసిన కె.చెన్నయ్య ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత సెలవులో వెళ్లారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఆర్డీఓగా బీఎస్ఎస్ రెడ్డి వ్యవహరించారు. ఆయన స్థానంలో భవానీ శంకరిని నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. త్వరలో ఆమె బాధ్యతలు ఇక్కడ స్వీకరించనున్నారు.

తాడేపల్లిగూడెం కమిషనర్‌గా ఏసుబాబు బాధ్యతల స్వీకరణ



తాడేపల్లిగూడెం : మునిసిపల్ కమిషనర్‌గా ఏసుబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ కార్పొరేషన్ నుంచి బదిలీపై వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. మునిసిపల్ పరిధిలో తాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. మునిసిపల్ ఇంజినీర్ రవి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ఏసుబాబు మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసును కలిశారు.

భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాలు



స్వామివారికి పవిత్రాలను సమర్పిస్తున్న అర్చకులు

కాళ్ల : మండలంలోని కాళ్లకూరు స్వయంభూః వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సప్తనదీ జలాభిషేక పూర్వక పవిత్రోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మూడో రోజు శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ద్వార తోరణపూజ, యాగశాల అర్చన, లోక కల్యాణార్థం ఆకాంక్షిస్తూ సుదర్శన, నారసింహ, సంక్షేపరామాయణ హోమాలు, సాయంత్రం స్వామి అమ్మవార్లకు పవిత్రవిసర్జన, నీరాజన మంత్రపుష్పాలు, తీర్థగోష్ఠి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పవిత్రతలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణాలు చేశారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు, గ్రామస్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించినారు. శనివారం ఉదయం స్వామివారికి సప్తనదుల జలాలతో అభిషేకాలు నిర్వహిస్తామని, దేవస్థానం కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్ తెలిపారు.

పోక్సో కేసు నమోదు

కాళ్ల: కాళ్ల మండలానికి చెందిన ఓ బాలికను వేధింపులకు గురిచేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. మానసిక దివ్యాంగురాలైన బాలిక 5వ తరగతి చదువుకుంటుంది. సీసలి గ్రామంలోని ఓ పాఠశాల ఉపాధ్యాయుడికి కారుడ్రైవర్‌గా పనిచేస్తున్న ఏలూరుకు చెందిన ఎం కపానంద్ ఈ నెల 19న బాలికను కారులోకి తీసుకెళ్లి వేధింపులకు గురిచేశాడు. జరిగిన ఘటనను బాలిక బంధువులకు వచ్చీరాని మాటల్లో చెప్పింది. బాధిత చిన్నారి కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించగా పోక్సో కేసు నమోదు చేసి, యువకుడిని అరెస్టు చేశామని ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికుల రక్షణ గాలికి..

- గ్లౌజులు, చెప్పులు, మాస్క్ వంటివి ఇవ్వని ప్రభుత్వం
- స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఫోజులిస్తున్న ప్రజాప్రతినిధులు

భీమవరం: మండుటెండ, వర్షాలను సైతం లెక్కచేయకుండా పారిశుద్ధ్య పనుల్లో నిమగ్నమయ్యే సిబ్బంది రక్షణను ప్రభుత్వం గాలికొదిలేసింది. రోడ్లు ఊడ్చేందుకు మొక్కుబడిగా చీపుర్లు ఇస్తున్నా చేతికి గ్లౌజులు, చెప్పులు, మాస్క్ వంటివి ఇవ్వడం లేదు. మునిసిపాల్టీలో పారిశుద్ధ్య కార్మికులు చేతికి పాలిథిన్ కవర్లు, ముక్కు, నోరుకు చీరకొంగు కట్టుకుని పనిచేయాల్సి వస్తుంది. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో చేతులు గ్లౌజులు వేసుకుని ఫొటోలకు ఫోజులిస్తోన్న ప్రభుత్వ పెద్దలు, ప్రజాప్రతినిధులు, అధికారులు తమ ఆరోగ్యాన్ని పట్టించుకోవాలని, గ్లౌజులు, చెప్పులు, మాస్క్ వంటివి ఇప్పించాలని పారిశుద్ధ్య కార్మికులు కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 1,800 మంది కార్మికులు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని మునిసిపాల్టీల్లో సుమారు 1,800 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో దాదాపు 800 మంది పర్మినెంట్, మరో వెయ్యికిపైగా అవుట్ సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నట్టు అంచనా. మేజర్ పంచాయతీలో కూడా పర్మినెంట్, అవుట్ సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులు పెద్ద సంఖ్యలోనే పనిచేస్తున్నారు. వీరంతా ప్రతిరోజూ తెల్లవారుజామునే పట్టణాలు, గ్రామాల్లోని రోడ్లు, వీధులను శుభ్రం చేసి చెత్తను డంపింగ్‌యార్డులకు తరలిస్తుంటారు. జిల్లాలోని దాదాపు అన్ని మునిసిపాల్టీలు, గ్రామాల్లో డంపింగ్ యార్డులు లేకపోవడంతో ఎక్కడ ఖాళీ ప్రదేశాలుంటే అక్కడే డంపింగ్ యార్డుగా చెత్తను గుట్టలుగా వేయడం పరిపాటిగా మారింది. చెత్తను తరలించే వాహనాలు వెళ్లే మార్గాలు సక్రమంగా లేకపోవడంతో సిబ్బంది అనేక ఇబ్బందులు పడుతున్నారు.



భీమవరంలో చేతికి గ్లౌజులేసుకుని రోడ్డు ఊడ్చుతున్నట్టు ఫోజిచ్చిన ప్రజాప్రతినిధులు, నాయకులు (ఫైల్)



రక్షణ ఏర్పాట్లు, చేతికి గ్లౌజులు లేక పాలిథిన్ కవర్ తొడుక్కొని పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

ఫొటోలకు ఫోజులు

కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్ర వ్యాప్తంగా అక్టోబర్ 2వ తేదీ వరకు పట్టణాలు, గ్రామాల్లో పారిశుద్ధ్య, పచ్చదనానికి మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రజాప్రతినిధులు సభలు, సమావేశాలు ఏర్పాటుచేసి స్వచ్ఛతా హీపై గొప్పగా ప్రసంగాలు చేస్తున్నారు. ఉదయమే పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేసిన రోడ్లుపై చెత్తను తుడుస్తున్నట్టుగా చేతులకు గ్లౌజులు వేసుకుని రోడ్లు ఊడుస్తున్నట్టు ఫొటోలకు ఫోజులిచ్చి వెళుతున్నారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు మొక్కుబడిగా కాకుండా ప్రజలకు స్ఫూర్తినిచ్చే విధంగా ఉండాలని పలువురు హితవుపలుకున్నారు.

గల్లంతైన విద్యార్థిని మృతదేహం లభ్యం

తణుకు: కాలువలో దూకి గల్లంతైన విద్యార్థిని మృతదేహం శుక్రవారం లభ్యమైంది. తణుకు మండలం కోనాల గ్రామానికి చెందిన తానంకి శ్రావణి సంధ్య (14) ముద్దాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. గురువారం స్కూల్‌కు వచ్చిన శ్రావణిసంధ్య పుస్తకాల సంచి అక్కడే ఉంచి బయటకు వెళ్లిపోయింది. అనంతరం ముద్దాపురం నుంచి దువ్వ వెళ్లే రోడ్డులో మూలలంక వెయ్యేరు కాలువలో దూకి గల్లంతైన విషయం తెలిసిందే. అయితే పోలీసులు, ఫైర్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు గురువారం నుంచి గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం ఉదయం కాలువలో శ్రావణి సంధ్య మృతదేహాన్ని గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్సై జీఎస్‌వీ మూర్తి తెలిపారు.

పలు అనుమానాలు

గురువారం ఉదయం యథావిధిగా స్కూల్‌కు వచ్చిన విద్యార్థిని శ్రావణి సంధ్య పుస్తకాల సంచి తరగతి గదిలో ఉంచి బయటకెళ్లిపోయింది. అక్కడి నుంచి మోటారు సైకిలిస్టును లిఫ్టు అడిగిన ఆమె మూలలంక వంతెన వద్ద దిగిపోయింది. తనకు ప్రాజెక్టు వర్కు ఉందని, వెనుక తన మిత్రులు వస్తున్నారని మోటారు సైకిలిస్టుకు చెప్పి పంపించివేసింది. అనంతరం అక్కడే చెప్పులు వదిలి కాలువలో దూకినట్టు భావించారు. ఉపాధ్యాయులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చేపట్టారు. అయితే బాలిక మృతిపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. ప్రేమ వ్యవహారమా లేక మరేదైనా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. విద్యాశాఖ ప్రాంతీయ అధికారి గగ్గులోతు నాగమణి, తణుకు జోన్ డీవైఈఓ డి.మురళీ సత్యనారాయణ, ఎంఈఓ హైమావతి, వీరవాసరం ఎంఈఓ శ్రీమన్నారాయణ, సీఈ బోర్డు కార్యదర్శి జీవీ శ్రీనివాస్, మంచిలి ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ తదితరులు తణుకు విచ్చేసి విద్యార్థి తల్లిదండ్రులను పరామర్శించారు.



శ్రావణి సంధ్య మృతదేహం



తానంకి శ్రావణిసంధ్య (ఫైల్)

జగన్‌ను అడ్డగించడం తగదు

జంగారెడ్డిగూడెం /ఏలూరు (ఆర్ఆర్‌పేట): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లకుండా అడ్డుకుంటున్న పోకడలు తగవని తిరుమల తిరుపతి పాదయాత్రికుడు స్వయంభు కాకినాడ భోగిగణపతి పీఠం ఉపాసకులు, ప్రముఖ సామాజికవేత్త దూసర్లపూడి రమణ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మతాల మధ్య అగాదాలు నెలకొల్పడం వల్ల సర్వసమానత్వం మంట గలుస్తుందని, ఇందుకు రాజ్యాంగం అంగీకరించదని వివరించారు. హిందూ, ఇస్లాం, క్రైస్తవ మత సంప్రదాయాలను గౌరవించే ప్రతి ఒక్కరూ భారత దేశంలో గుడి, మసీదు, చర్చిలకు వెళ్లే హక్కు ఉందని తెలిపారు. తిరుపతికి ప్రతిపక్ష నేతగా, ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి ఉన్నప్పుడు గాని, గతంలో ప్రతిపక్ష నేతగా, ముఖ్యమంత్రిగా జగన్ ఉన్నప్పుడు గాని, సుప్రీం కోర్టు జడ్జి, రాష్ట్రపతి, ప్రధాని తదితరులతో వెళ్లినప్పుడు గాని అడ్డు తగలని డిక్లరేషన్ మాజీ సీఎంగా మారిన తరువాత కుట్రపూరిత కల్తీ లడ్డూ ఎపిసోడ్‌తో అగాధాలు సృష్టించడం పట్ల ప్రజల్లో అసహనం ఉందని వివరించారు. హిందూ మతాచారాలను గౌరవించే వారికి మోకాలడ్డటం సరికాదని పేర్కొన్నారు.



భోగిగణపతి పీఠం ఉపాసకులు రమణరాజు

డెంగీతో యువకుడి మృతిపై విచారణ

తణుకు: తణుకులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యారోగ్య శాఖ అధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. ఇటీవల అత్తిలి గ్రామానికి చెందిన ఒక యువకుడు డెంగీ చికిత్స పొందుతూ మృతి చెందడంతో అధికారులు ఆ ఆసుపత్రిలో వివరాలను సేకరించారు. జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.భానునాయక్, ఆకివీడుకు చెందిన వైద్యులు రాజేష్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించారు. తణుకు సూర్యాలయం వీధిలో భాను ఆసుపత్రిలో జ్వరంతో చేరిన దిలీప్ అనే యువకుడికి డెంగీ నిర్ధారించిన వైద్యుడు సుంకు జీవన్ రవితేజ చికిత్స చేశారు. అయితే పరిస్థితి విషమించడంతో దిలీప్‌ను మరో ఆసుపత్రికి రిఫర్ చేయడంతో మృతి చెందారు. దీనిపై బాధితులు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, డీఎంఅండ్‌హెచ్ఓ మహేశ్వరరావు ఆదేశాలతో అధికారులు తనిఖీలు చేశారు. అయితే ఉక్రెయిన్‌లో పట్టా పొందిన సదరు వైద్యుడు ఎండీ ఫిజీషియన్‌గా చెలామణి అవుతున్నట్టు గుర్తించామన్నారు. మరోవైపు ఆసుపత్రిలో నిర్వహిస్తున్న లేబొరేటరీకి అనుమతులు లేవని చెప్పారు. మందుల షాపులో ఫార్మాశిస్టు లేకపోడం వంటి లోపాలను గుర్తించామని తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు సంబంధించిన పత్రాలు లేకపోవడంతో పాటు రోగులకు అందిస్తున్న చికిత్స వివరాలు అందుబాటులో లేవని ఆసుపత్రి వర్గాలు చెబుతున్నట్టు అధికారులు తెలిపారు. ప్రాథమిక విచారణ అనంతరం ఆసుపత్రి లైసెన్సు సస్పెండ్ చేసి విచారణ నివేదికను జిల్లా కలెక్టర్, డీఎంఅండ్‌హెచ్ఓలకు అందజేస్తామని భానునాయక్ వెల్లడించారు.



ఆసుపత్రి లేబొరేటరీలో టెక్నీషియన్‌ను విచారిస్తున్న డాక్టర్ భానునాయక్

జీఆర్ రెడ్డి గ్రంథాన్ని ఆవిష్కరించిన కిరణ్‌బేడీ

తాడేపల్లిగూడెం: గ్లోకోమా సొసైటీ ఆఫ్ ఇండియా అలిండియా 33వ మహాసభలు పాండిచ్చేరిలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన ప్రముఖ నేత్రవైద్యుడు డాక్టర్ జీఆర్ రెడ్డి రచించిన గ్లోకోమా నివారణలో ఇంటర్ పిటిషన్ ఆఫ్ విజువల్ ఫీల్డ్స్ ఇన్ ఆప్టికల్ కోహినెన్సీ ట్రోమోగఫీ అనే గ్రంథాన్ని పాండిచ్చేరి లెఫ్టినెంట్ మాజీ గవర్నర్ కిరణ్‌బేడీ ఆవిష్కరించారు. నీటి కాసుల వైద్యంలో నేత్ర వైద్యులకు మెరుగైన చికిత్స అందించడానికి ఈ గ్రంథం బాగా ఉపయోగపడుతుందని వక్తలు పేర్కొన్నారు. దేశంలో 2,000 మంది గ్లోకోమా నేత్రవైద్య నిపుణులున్నారని, వీరికి అద్భుతమైన గ్రంథాన్ని 200 పేజీలతో, 30 కేసుల విశ్లేషణాత్మక దృశ్య మాలికలతో రూపొందించామని జీఆర్‌రెడ్డి చెప్పారు. గ్లోకోమా సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు బి.కుమార్ నాయక్, ప్రధాన కార్యదర్శి ఎం దీప్‌సింగ్, కోశాధికారి మనీష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ జీఆర్ రెడ్డి రచించిన గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న పాండిచ్చేరి మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడీ

విద్యుత్ సమస్యలకు ఫ్రీగా పరిష్కారం

భీమవరం: విద్యుత్ సమస్యల పరిష్కారానికి విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం ద్వారా ఉచిత సేవలు పొందవచ్చని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం చైర్మన్ బి.సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం భీమవరం విద్యుత్ శాఖ డీఈ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరణ, పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటి వరకు అందిన 8,112 ఫిర్యాదుల్లో 8,036 పరిష్కరించామన్నారు. గత ఏడాది 536 ఫిర్యాదులు పరిష్కరించగా, ఈ ఏడాది 350 ఫిర్యాదులకు 76 కేసులు పరిష్కరించాల్సి ఉందని సత్యనారాయణ వివరించారు. న్యాయస్థానం సభ్యుడు రాయసం సురేంద్రకుమార్, విద్యుత్ శాఖ డీఈ ఎస్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరిష్కారం కాకపోతే పరిహారం

విద్యుత్ వినియోగదారుల న్యాయస్థానం ద్వారా అన్ని రకాల విద్యుత్ సమస్యలను ఎలాంటి ఖర్చూ లేకుండా పరిష్కరించుకోవచ్చని విద్యుత్ వినియోగదారుల న్యాయస్థానం చైర్మన్ బి.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం భీమవరం డీఎన్నార్ కళాశాలలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యుత్ సంస్థ సమస్యను నిర్ణీత కాలంలో పరిష్కరించపోతే వినియోగదారులు విద్యుత్ పంపిణీ సంస్థ నుంచి తగిన నష్ట పరిహారం పొందే అవకాశం ఉందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు టోల్ ఫ్రీ నెంబర్ 1912పై తగిన అవగాహన కలిగి ఉండాలన్నారు. న్యాయస్థానం స్వతంత్ర సభ్యుడు రాయసం సురేంద్రకుమార్, కళాశాల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, పి.రామకృష్ణంరాజు, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్‌జే సోమరాజు తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న అధికారులు

వరి పై ఎండాకు తెగులు

ఆందోళనలో రైతులు

భీమవరం: భారీ వర్షాలు, వరదలు కారణంగా సార్వా వరిని ఎండాకు తెగులు ఆశించింది. ఈ తెగులు నీటిద్వారా ఇతర ప్రాంతాల్లోని పొలాలకు వ్యాప్తి చెందుతుంది. ప్రభుత్వం ఇప్పటివరకు పెట్టుబడి సహాయం, ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వకపోవడంతో అప్పులుచేసి సార్వా నాట్లు వేస్తే.. ప్రస్తుతం వరిపై తెగులు ఆశించి కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో సుమారు 2.19 లక్షల ఎకరాలో వరిసాగు చేస్తున్నారు. సార్వా వరి కొన్నిచోట్ల ప్రస్తుతం పిలకలు కట్టే దశలోను, ముందుగా నాట్లు వేసిన ప్రాంతాల్లో పైరు చిరుపొట్ట దశలోను ఉంది. భారీ వర్షాల ముంపునకు గురైన వరికి ఎక్కువగా ఎండాకు తెగులు ఆశిస్తోంది. ఈ తెగులు వరిపైరుపై మూడు దశల్లో ఆశిస్తుంది. జాంథోమోనాస్ ఒరైజే పాథోవోర్ ఒరైజే అనే ఒక బాక్టీరియా వల్ల ఆశించే ఎండాకు తెగులను సరైన సమయంలో గుర్తించి, తగిన యాజమాన్య చర్యలు చేపడితే నష్టాన్ని తగ్గించుకొని మంచి దిగుబడి సాధించవచ్చని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

పాడి పంట

ఎండాకు తెగులు లక్షణాలు

ఎండాకు తెగులు నారుమడి దశలో ఆకులు అంచుల నుంచి లోపలివైపునకు నీటి డాగు మచ్చల మాదిరిగా ఏర్పడి క్రమేపీ పసుపు రంగుకు మారి నాట్లు వేసిన నెల రోజుల వరకు కన్పిస్తుంది. కొన్ని పర్యాయాలు నాట్లువేసిన 30 రోజుల తరువాత కూడా ఈ తెగులు ఆశించవచ్చు. తెగులు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు దుబ్బులో కొన్ని పిలకలు లేదా దుబ్బు మొత్తం చనిపోతుంది. దీనిని 'క్రెసెక్' దశ అంటారు. అయితే చాలా మంది రైతులు ఈ లక్షణాలను కాండం కుళ్లు, దుబ్బు కుళ్ల తెగులుగా పొరపడి శిలీంద్రనాశినులు పిచికారీ చేయడం వల్ల తెగులు నివారణ జరగకపోగా సాగు ఖర్చు పెరుగుతుంది.

తెగులు నిర్ధారణ ఇలా..

ఎండిన వరి ఆకులను ముక్కలుగా కత్తిరించి మంచి నీటితో ఉన్న గాజు గ్లాసులో వేయాలి. అరగంట తరువాత నీటిని గమనిస్తే తెగులు ఆశించిన భాగాల నుంచి బాక్టీరియా నీటిలోకి ప్రవేశించడం వల్ల నీటి గాఢత పెరిగి పసుపు రంగులోకి మారుతుంది. ఈ లక్షణాలను బట్టి బాక్టీరియా ఎండాకు తెగులు ఆశించినట్టుగా గుర్తించాలి. కాండం కుళ్లు ఆశించిన పిలకలను గమనిస్తే మొదటి కణుపు వద్ద కుళ్లి, మొక్క చనిపోతుంది. అటువంటి పిలకలను చీల్చి చూస్తే మొదటి కణుపు వద్ద నల్లగా మారుతుంది.

ఎండాకు తెగులు దశ

వరిలో సాధారణంగా పిలకలు కట్టే దశలో ఎడతెరిపి లేకుండా గాలులతో కూడిన వర్షాలు పడుతున్న వాతావరణం, ఉష్ణోగ్రత 32 డిగ్రీల సెంటిగ్రేడ్ కంటే తక్కువగా ఉన్న వాతావరణంలో, మొక్కల సాంద్రత ఎక్కువగా ఉన్నటువంటి పొలాల్లో, అధికంగా నత్రజని వాడిన పొలాల్లో ఎండు తెగులు ఆశించి నష్టం కలుగజేస్తుంది. తెగులు ఉధృతి ఎక్కువైతే మచ్చలు కలిసిపోయి ఆకంతా ఎండిపోతుంది. కొన్ని సందర్భాల్లో మధ్య ఈనె వెంబడి ఎండిపోయి, అంచులు ఆకుపచ్చగా ఉంటుంది. ఇటువంటి పొలాల్లో ఉదయం సమయంలో పైరును గమనిస్తే తెగులు సోకిన భాగాల నుంచి పసుపు రంగులో ఉండే జిగురులాంటి పదార్థం బిందువులుగా బయటకు ఉబికి వస్తుంది. క్రమేపీ ఎండ పెరిగితే ఈ బిందువులు ఎండిపోయి నీటిలో పడిపోతాయి. ఇటువంటి నీటిని ఒక పొలం నుంచి మరో పొలానికి వెళ్లడం వల్ల తెగులు కూడా వ్యాప్తి చెందుతుంది.



ఎండాకు తెగులు ఆశించిన సార్వా వరి

యాజమాన్య పద్ధతులు పాటించాలి



నత్రజని ఎరువులను సిఫారసు చేసిన మేరకే వినియోగించాలి. వర్షాలు పడే వాతావరణంలో ఆకులపై తెగులు లక్షణాలు 5 శాతం కంటే ఎక్కువగా వ్యాపిస్తే పైపాటుగా వేయాల్సిన నత్రజని ఎరువులను తాత్కాలికంగా నిలిపివేయాలి. ఎండలు కాసిన తరువాత మాత్రమే వేసుకోవాలి. సిఫార్సు చేసిన పొటాష్‌ను మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో రెండు దఫాలుగా నాట్లువేసే సమయంలోనూ చిరుపొట్ట దశలోనూ వేయాలి. పొలం గట్లపై బాక్టీరియాకు అవకాశం కల్పించే కలుపు, ఇతర పిచ్చి మొక్కలు లేకుండా శుభ్రం చేసుకోవాలి. తెగులు లక్షణాలు గమనించిన వెంటనే పొలంలో నీటిని రెండు, మూడు పర్యాయాలు బయటకు తీసివేసి కొత్త నీరు పెట్టాలి. ఎకరాకు 20 కిలోల పొటాష్ పైపాటుగా వేసుకోవాలి. కాపర్ హైడ్రాక్సైడ్ మందును రెండు గ్రాములు లేదా కాపర్ సల్ఫేట్ 2 మిల్లీ లీటరు లేదా ప్లాంటోమైసిన్ గ్రాము మందును లీటరు నీటిలో కలిపి పైరు పూర్తిగా తడిచేవిధంగా 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయడం వల్ల ఎండాకు తెగులు వ్యాప్తిని అరికట్టవచ్చు. – జెడ్ వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, భీమవరం

సారా తయారీదారుల అరెస్ట్

ఆగిరిపల్లి: మండలంలోని సీతారాంపురంలో సారా తయారీ కేంద్రంపై దాడిచేసి ఇద్దర్ని అరెస్ట్ చేసినట్టు ఎస్సై శుభోశేఖర్ తెలిపారు. బూరుగు నరేష్, కొమ్మవరపు ఏసోబు అనే వ్యక్తులు అక్రమంగా సారా తయారు చేస్తుండగా శుక్రవారం అరెస్ట్ చేశామని, 20 లీటర్ల సారా స్వాధీనం తీసుకుని, 500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై తవేరియా నాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సీతారాంపురంలో సారా తయారీదారులను అరెస్ట్ చేసిన పోలీసులు

యనమదుర్రు కాలువలో మృతదేహం లభ్యం

భీమవరం : యనమదుర్రు కాలువలో దూకిని వ్యక్తి మృతదేహం శుక్రవారం లభ్యమైందని టుటౌన్ పోలీసులు తెలిపారు. పట్టణానికి చెందిన పి.నాగబాబు (32) ఈనెల 25వ తేదీన యనమదుర్రు కాలువలో దూకగా, అతని భార్య రాణి ఫిర్యాదు మేరకు ఎస్సై రెహమాన్ కేసు నమోదు చేశారు. నాగబాబు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై స్వామి తెలిపారు.

వినాయక నిమజ్జనంలో యువకుడి మృతి

దెందులూరు: మండలంలోని చల్లచింతలపూడి గ్రామంలో గురువారం రాత్రి వినాయక విగ్రహం నిమజ్జనం అనంతరం చెరువులో స్నానం చేస్తుండగా సింహాద్రి అయ్యప్ప (28) ప్రమాదవశాత్తు మృతి చెందాడు. అయ్యప్పకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయ్యప్ప మృతి పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. గ్రామ సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ, ఎంపీటీసీ సింహాద్రి సరస్వతి శ్రీమన్నారాయణ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు వేమన నాగరాజు, స్నేహితులు, కార్యకర్తలు అయ్యప్ప మృతదేహం వద్ద నివాళులర్పించారు.



మృతి చెందిన సింహాద్రి అయ్యప్ప

30న జంగారెడ్డిగూడెంలో జాబ్‌ఫెయిర్

జంగారెడ్డిగూడెం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఎస్‌హెచ్ (స్కిల్ హబ్) జంగారెడ్డిగూడెంలో ఈ నెల 30న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఏలూరు జిల్లా నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం వసంతరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ జాబ్ ఫెయిర్‌లో అపోలో ఫార్మసీస్ లిమిటెడ్, ఎస్ఎస్ఎస్‌వీ (అరబిందో ఫార్మా), ఎయిర్టెల్ పేమెంట్ బ్యాంక్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, సుమారు 220 మంది యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సెల్ ఫోన్ నెంబర్లు 96425 98324, 96525 03799ను (99888 53335 టోల్ ఫ్రీ)లో సంప్రదించాలని తెలిపారు.

క్లుప్తంగా

విద్యార్థుల ప్రతిభ



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పెంటపాడు: మండలంలోని ప్రభుత్వ బేసిక్ స్కూల్ విద్యార్థులు నియోజవర్గస్థాయి నుంచి జిల్లా స్థాయి ఎంపికయ్యారని ఎంఈవోలు టీవీ రామకృష్ణ, ఎం.శ్రీనివాస్‌లు తెలిపారు. అండర్–14, అండర్ –17 వాలీబాల్, కబడ్డీ పోటీల్లో ఎంపికై న విద్యార్థులను హెచ్‌ఎం రాజేష్, సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, కొవ్వూరి లక్ష్మణ రెడ్డిలు ప్రత్యేకంగా అభినందించారు. వారికి నిరంతం శిక్షణ అందించిన వ్యాయామ ఉపాధ్యాయులు దిలీప్, పోసియ్యలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూలు విద్యాకమిటీ సభ్యులు కళింగ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ. డి.విశ్వనాథ్

తాడేపల్లిగూడెం: ఆలయాల భద్రత విషయంలో నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ డి.విశ్వనాథం కోరారు. శుక్రవారం పట్టణంలోని మాగంటి ఫంక్షన్ హాల్‌లో దేవాలయాల ధర్మకర్తలు, కమిటీ సభ్యులతో సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలీసు శాఖ ఎప్పుడూ సాయం అందజేస్తుందని, పోలీసుల సేవలు వినియోగించుకోవాలన్నారు. ఈ సమావేశంలో గూడెం, తణుకు సీఐలు ఏ.సుబ్రహ్మణ్యం, ఎస్.కొండయ్యలు పాల్గొన్నారు.

అన్నసమారాధన



రామారావుపేటలో అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక రామారావుపేటలోని గణేష్ యాత్ ఆధ్వర్యంలో 23వ గణపతి నవరాత్రులు ఉత్సవం సందర్భంగా శుక్రవారం భారీ అన్నసమరాధన జరిగింది. 4 వేల మందికి భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ అన్నసమారాధనలో పాల్గొని స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పేరిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు పేరిచర్ల మురళీకృష్ణంరాజు, రుద్రా వినయ్, తాళ్ళ సూరిబాబు, రుద్రా గణేష్, మురళీ, శివ, జ్యోతి స్వరూప్, రుద్ర గిరి, రమేష్ నాయుడు, ప్రభాకర్, ప్రసాద్, జగన్నాథం, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఏసీ కమిషనర్ మురళీకృష్ణకు సత్కారం



మురళీకృష్ణకు వీడ్కోలు సత్కారం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మునిసిపల్ ఎఫ్‌ఏసీ కమిషనర్‌గా పనిచేసిన ఎంఈ మురళీకృష్ణ బదిలీపై విశాఖపట్నం వెళ్తున్న సందర్భంగా శుక్రవారం పతాంజలి యోగాలయంలో వీడ్కోలు అభినందన సభ జరిగింది. మురళీకృష్ణ పతాంజలి యోగాలయంలో సభ్యుడిగా ఉండటంతో యోగాలయంలో ఆయనకు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో యోగాచార్యులు వింజుమూరి మాధవరావు, మాకా శ్రీనివాసరావు, గ్రంధి సత్యనారాయణ, కడియాల పరశురాం, కుంట్ల మోహన్‌రావు ఏఈ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు వెంకన్న ఆలయంలో కారుమూరి పూజలు

తణుకు అర్బన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు తణుకు రాష్ట్రపతి రోడ్డులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఉదయం 10గంటలకు మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య తెలిపారు. ఈ పూజాధికాల్లో ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, పార్టీ శ్రేణులు పాల్గొంటారని వివరించారు.

మాధవరంలో 'ఇది మంచి ప్రభుత్వం'

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం గ్రామంలో శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వంద రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. సర్పంచ్ ముప్పిడి సూర్యకుమారి, మాజీ సర్పంచ్ కవులూరి పరిమళ, సూరిశెట్టి గణపతి, కూటమి సభ్యులు, గ్రామసచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జల ప్రాంగణం..!

- తణుకులో దంచికొట్టిన వర్షం
- రోడ్లన్నీ జలమయం

తణుకు టౌన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తణకు పట్టణం తడిసి ముద్దయింది. అయితే శుక్రవారం ఉదయం కురిసిన వర్షంతో జన జీవనం స్తంభించిపోయింది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చిన్నపాటి వర్షానికే తణకు ఆర్టీసీ బస్టాండు జలమయమవుతోంది. లోతట్టుప్రాంతం కావడంతో మురగంతా ఆర్టీసీ ఆవరణలో నిలిచిపోతుంది. పట్టణంలోని పైడిపర్రు వై జంక్షన్ వద్ద వర్షపు నీరు నిలిచిపోయి చెరువులా తయారైంది. తణుకు బస్టాండ్ నుంచి మండపాక వెళ్లే రోడ్డులో వర్షపు నీరు నిలిచిపోయింది. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని రోడ్లు నీటి మునిగిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలోని వేల్పూరు, దువ్వ, తేతలి గ్రామాల్లోని పలు వీధులు, కాలనీలలోనిరోడ్లు నీట మునిగాయి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒక వైపు వాకింగ్ ట్రాక్ మెరక చేయడంతో పాటు మురుగు నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో డిగ్రీ కళాశాల ఆవరణలో వర్షం నీరు నిలిచిపోతుంది.



భారీ వర్షానికి చెరువులా మారిన పైడిపర్రు జంక్షన్



భారీ వర్షంతో కళాశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు



వేల్పూరులో మెయిన్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



తణుకు మండపాక రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

ఎర్ర కాలువపై బ్రిడ్జి నిర్మించాలి



మాధవరంలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: కంసాలిపాలెం – మాధవరం గ్రామాల మధ్య ఎర్ర కాలువ బ్రిడ్జిని నిర్మించాలని, ఎర్ర కాలువ గట్లను పటిష్టం చేయాలని సీపీఎం మాధవరం గ్రామ శాఖ మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం మండలంలోని మాధవరం గ్రామంలో సీపీఎం గ్రామ మహాసభ గోపాల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం మండల కన్వీనర్ పాలుపూరి సత్యనారాయణ, నాయకులు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ గత మూడేళ్లలో కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టి చర్చించారు. భవిష్యత్ కార్యక్రమాలు విజయవంతానికి కృషి చేయాలన్నారు. అనంతరం సీపీఎం మండల నూతన కార్యదర్శిగా పురిటిగడ్డ జయమ్మ ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో నిచ్చెనకోళ్ళ రాముడు, మల్లుల పరమేశు, వయ్యేరి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా



సమావేశంలో మాట్లాడుతున్న అప్సడా మాజీ వైస్‌చైర్మన్ వడ్డి రఘురాం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని బంగారుగూడెం గ్రామంలో శుక్రవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ శ్రేణులతో ఆంధ్రప్రదేశ్ ఆక్వా డెవలప్‌మెంట్ కల్చర్ అథారిటీ (అప్సడా) మాజీ వైస్‌చైర్మన్ వడ్డి రఘురామ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేడర్‌కు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని భరోసానిచ్చారు. క్షేత్ర స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. జెడ్పీటీసీ ముత్యాల అంజనేయులు, ఎంపీపీ పానుకుమాటి శేషులత, సర్పంచ్ చుండ్రు తేజస్విని, ఎమ్పీటీసీలు మార్లపూడి సుబ్బారావు, బుర్ల సుబ్బలక్ష్మి, మాజీ ఎమ్పీటీసీ బుర్ల కట్లయ్య, నాయకులు మాకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ముప్పిడి మురళీ, మాకరాజు సతీష్, కొండుబోయిన కృపావరం, మాకిరెడ్డి నెహ్రూ, నల్లమిల్లి అంజిరెడ్డి పాల్గొన్నారు.

సర్పంచ్ రాజారావుకు పరామర్శ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని చినతాడేపల్లి గ్రామ సర్పంచ్ పిచ్చుకల రాజారావు అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆయనను శుక్రవారం అక్వా డవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) మాజీ వైస్‌చైర్మన్ వడ్డి రఘురామ్ నాయుడు పరామర్శించారు. రాజారావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పూర్తి ఆరోగ్యంతో ప్రజల్లోకి రావాలని ఆకాంక్షించారు. ఆయన వెంట జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పానుకుమాటి శేషులత, ఎమ్పీటీసీ మార్లపూడి సుబ్బారావు, ఉప సర్పంచ్ చిట్టూరి కాశీవిశ్వనాథం, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చిన్నం సురేష్, నియోజకవర్గ సోషల్‌మీడియా కన్వీనర్ ఉర్ల నవీన్, నాయకులు అంజిరెడ్డి, పుల్లయ్య తదితరులు ఉన్నారు.



జట్లపాలెం గ్రామంలో కట్టుబోయిన కృష్ణప్రసాద్ దంపతులను కలిసిన వడ్డి రఘురాం

జట్లపాలెం వైఎస్సార్ సీపీ నాయకులను కలుసుకొన్న వడ్డిరఘురాం

పెంటపాడు: మండలంలోని జట్లపాలెం గ్రామంలో ఏపీ మాజీ అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో మండల వ్యవసాయ సలహామండలి మాజీ అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు కట్టుబోయిన వెంకటలక్ష్మి, మాజీ సర్పంచ్ కట్టుబోయిన భాస్కరరావులను ఆయన కలిసారు. ఈ కార్యక్రమంలో గొన్నూరి గంగరాజు, గుమ్మళ్ల రత్నరాజు, కునుకు పుల్లయ్య, గ్రామ ఎస్సీపేట వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీహెచ్ఈవో సత్యనారాయణ

పెంటపాడు: సీజనల్ వ్యాధులతో పాటు, మాతా శిశుసంరక్షణ పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ముదునూరు ఎంపీహెచ్ఈవో సత్యనారాయణ తెలిపారు. ముదునూరు పీహెచ్‌సీ పరిధిలో ఉన్న సబ్‌సెంటర్‌ల సిబ్బందికి సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నెలరోజుల నుంచి సబ్‌సెంటర్‌లో ప్రజల ఆరోగ్యంపై తీసుకొన్న చర్యలు, మందుల వినియోగం, మాతా శిశువుల ఆరోగ్యం తదితర విషయాలపై చర్చించి సమీక్షించారు. సూపర్‌వైజర్ మోహనరావు, హెచ్‌వీ మెర్సిలు మాట్లాడుతూ వర్షాకాలంలో డ్రైడే కార్యక్రమాలు, నీటి నిల్వలు లేకుండా చూడాలని, దోమల లార్వా ప్రబలకుండా పంచాయతీ సిబ్బందితో కలిసి నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టీకాల రిజిస్ట్రేషన్, ఓపీ వివరాలు, యాప్‌ల నిర్వహణ ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రెడ్డిబాబు రమణ, పూజ్యం శ్రీనివాస్, శేఖర్, ఆరోగ్యశాఖ సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

డ్రెయినేజీలను డస్ట్‌బిన్‌గా వాడద్దు



తణుకులో వ్యాధుల నివారణపై అవగాహన కల్పించే విధంగా కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: డ్రెయినేజీలను డస్ట్ బిన్‌గా వాడరాదని నీటి పారుదలకు ఆటంకం కలగనివ్వరాదని సబ్ యూనిట్ ఆఫీసర్ గుడిమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని జంగం చెర్వు, జయంతి కాలనీల్లో శుక్రవారం నిర్వహించిన డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. దోమ పుట్టుకను నివారించగలిగితే వ్యాధులను అరికట్టవచ్చని అన్నారు. చిన్నపాటి నీటి నిల్వలు, నిరుపయోగ సామాగ్రి దోమలకు ఆవాసాలని స్పష్టం చేశారు. ఇంటి ఆవరణల్లో అవసరం లేని నీటినిల్వలను తొలగింపచేయాలని, రిఫ్రిజిరేటర్లు, కూలర్స్, మొక్కల కుండీలను వారానికోసారి శుభ్రం చేసుకోవాలని సూచించారు. సెప్టిక్ ట్యాంకు గాలి గొట్టాలకు నైలాన్ వైర్ మెష్‌తో చుట్టి ఉంచాలని చెప్పారు. ఈ సందర్భంగా వ్యాధులపైనా, పరిసరాల పరిశుభ్రతపైనా అవగాహన కలిగేలా కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫైలేరియా యూనిట్ సూపర్‌వైజర్ కె.సత్యనారాయణ, వార్డు హెల్త్ సెక్రటరీలు కే బేబీ కుమారి, ఎస్.భానుశ్రీ, హెల్త్ అసిస్టెంట్ ఎస్.తాతాజీ, ఆశ కార్యకర్త ఇ.లలిత పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక



ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపికైన పెదతాడేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి పోటీలకు మండలంలోని పెదతాడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు షేక్ లాల్ బీబీ శుక్రవారం తెలిపారు. షాట్‌పుట్, డిస్కస్ త్రో, వాలీబాల్, కబడ్డీ విభాగాల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారన్నారు. క్రీడా స్ఫూర్తిని కొనసాగిస్తూ జిల్లా స్థాయి క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థులను డీవైఈవో రవీంద్రభారతి, ఎంఈవో వి.హనుమ, పీఈటీ ఎ.నాగార్జునరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. జగన్నాథపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన బాలబాలికలు అండర్–14, 17 కబడ్డీ, ఖోఖో విభాగాల్లో ఎంపికైనట్లు వివరించారు. కబడ్డీ అండర్–17 బాలబాలికల విభాగంలో ఎం.లోకేష్, యు.దుర్గా వీనిత, పి.గణశ్రీహరిణి, సీహెచ్.అదితి, ఖోఖో అండర్–14 బాలికల విభాగంలో ఎస్.షణ్ముఖ ప్రియ హర్షిణి, జి.సాయిఅపర్ణ, జి.నాగలక్ష్మి, అండర్–17 బాలికల విభాగంలో యు.దుర్గాలిఖిత, పి.గణశ్రీ హరిణి, సీహెచ్.అనిత, అండర్–17 బాలుర విభాగంలో వీరేష్, జి.సురేష్, టి.సత్యనారాయణ మూర్తిలు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను సర్పంచ్ చంద్రిక, ఎమ్పీటీసీ నాగులు, ప్రధానోపాధ్యాయుడు డి.శ్రీనివాసరావు, విద్యాకమిటి చైర్మన్ అరిగెల వెంకటకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయుడు కే. వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజల్లో పార్టీ శ్రేణులు పాల్గొనాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జద్దు హరిబాబు

తాడేపల్లిగూడెం రూరల్: వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శనివారం తాడేపల్లిగూడెం పట్టణంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించనున్న పూజల్లో పార్టీ శ్రేణులు పాల్గొనాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జద్దు హరిబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని మాధవరం గ్రామంలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జద్దు హరిబాబు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు చేసిన పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో పూజలు జరుగుతాయన్నారు. పార్టీ శ్రేణులు హాజరు కావాలన్నారు. ఎమ్పీటీసీ ప్రత్తి రంగ, ప్రత్తి బాబి, శివాలయ కమిటి మాజీ అధ్యక్షుడు గోపిశెట్టి దొరబాబు, మండల విద్యార్థి విభాగ అధ్యక్షుడు బండారు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సజ్జాపురంలో పందుల స్వైర విహారం

- ఏ రోడ్డులో చూసినా హల్‌చల్ చేస్తున్న పందులు
- భయపడుతున్న ప్రజానీకం..
- జ్వరాలతో సతమతమవుతుంటే మరోపక్క పందులా
- గత ఐదేళ్లు కనిపించని పందులు ఇప్పుడెలా వచ్చాయంటూ నోరెళ్లబెడుతున్న ప్రజానీకం..



తణుకు సజ్జాపురం అండర్ పాస్ ప్రాంతంలో పందుల స్వైర విహారం

తణుకు అర్బన్: తణుకు సజ్జాపురంలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. రోడ్లపైన, ఖాళీస్థలాల్లోను తిష్టవేసి దుర్గంధపూరితమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నాయని సజ్జాపురవాసులు ఆరోపిస్తున్నారు. గత ఐదేళ్ల కనిపించని పందులు ఇప్పుడు ఎందుకు.. ఎలా వచ్చాయంటూ ప్రజానీకం ముక్కున వేలేసుకుంటున్నారు. పందుల కారణంగా మెదడువాపు, స్వైన్‌ఫ్లూ వంటి వ్యాధులు మానవాళికి వస్తున్నాయని గతంలో పందులను ఊరికి దూరంగా తరలించారు. ఊరి చివర కంపోస్టు యార్డు ప్రాంతాలకే పరిమితమైన పందులు నేడు సజ్జాపురంలో కలియతిరుగుతున్నాయని ప్రజానీకం భయపడుతున్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలో గత ఐదేళ్లు ఒక్క పంది కూడా చూద్దామన్నా కనిపించలేదని కానీ నేడు వీరవిహారం చేస్తున్నాయని ప్రజానీకం గగ్గోలు పెడుతున్నారు.

అసలే జ్వరాల భయం..

విష జ్వరాలే కాకుండా వైరల్, డెంగ్యూ, కీళ్ల నొప్పులకు సంబంధించిన జ్వరాలతో ప్రజానీకం అతలాకుతలమై ప్రాణాలు పోతున్న నేటి రోజుల్లో నేడు పందులను చూసి ప్రజానీకం హడలెత్తిపోతున్నారు. తణుకులోని ప్రభుత్వ ఆస్పత్రులతోపాటు సుమారుగా 70 ప్రైవేటు ఆస్పత్రులు నిత్యం జ్వరపీడితులతో కిక్కిరిసి ఉంటున్నాయి. ఒళ్లు వులపరంగా ఉందంటే చాలు జ్వరం వచ్చేస్తుందేమోనని భయపడే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే తణుకు నియోజకవర్గంలోని అత్తిలిలో ఒక చిన్నారి డెంగీతో మృత్యువాత పడిందనే కథనాలతోపాటు జ్వరంబారినపడి ఇద్దరు యువకుల మరణాలు సైతం ఆ కుటుంబాలే కాకుండా ప్రజలు సైతం జీర్ణించుకోలేకపోతున్నారు.



తణుకు సజ్జాపురం కోయాక్సిల్ రోడ్డులో పందులు



తణుకు సజ్జాపురం రామకృష్ణ మఠం వీధిలో ప్రైవేటు స్థలంలో తిష్టవేసిన పందులు

మినీ జూబ్లీలాంటి సజ్జాపురంలో...

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌తో పోల్చుకునే సజ్జాపురం తణుకు మునిసిపాలిటీలో అత్యంత ఖరీదైన ప్రాంతం కావడంతో అధికశాతం ఇక్కడ స్థిరపడడానికి చొరవ చూపిస్తుంటారు. ఒక భవనాన్ని మించి మరొక భవనం నిర్మాణం చేసుకునే టువంటి ముఖ్య ప్రాంతంలో పందులు తిష్టవేయడాన్ని సజ్జాపురవాసులు జీర్ణించుకోలేకపోతున్నారు. మోడల్ తణుకు.. స్వచ్ఛభారత్ వంటి మాటలు దేవుడెరుగు ముందు పందులను తరలించండి మహాప్రభో అంటూ సజ్జాపురవాసులు వేడుకుంటున్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

పెంటపాడు: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జీజీబీ విజయలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని కె. పెంటపాడు గ్రామంలో శుక్రవారం పోషణ మాసోత్సవాలు పురస్కరించుకొని గ్రామంలో ఎస్‌డబ్ల్యూ యుపీ స్కూల్ నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోషణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం తల్లులకు, కిశోర్‌బాలికలకు న్యూట్రిషియన్‌పై ఎగ్జిబిషన్ నిర్వహించారు. ప్రభుత్వం ఐసీడీఎస్ ద్వారా ప్రవేశపెట్టిన పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు పీహెచ్‌సీ సబ్‌సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి కోసం తనిఖీలు



గంజాయి కోసం తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ సుబ్రహ్మణ్యం

తాడేపల్లిగూడెం: పట్టణంలోని శశి, నిట్ కళాశాలల పరిసరాల దుకాణాలలో గంజాయి కోసం శుక్రవారం పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

30న ఆర్‌ఆర్‌డీఎస్ కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

భీమవరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో భీమవరం ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 30న ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ వీకేజే ప్రసూన చెప్పారు. బజాజ్ క్యాపిటల్, ముత్తూట్ ఫైనాన్స్, అపోలో ఫార్మసీ, ఏపీఏసీ ఫైనాన్సియల్ సర్వీసెస్ తదితర కంపెనీల్లో ఉద్యోగాల కోసం నిర్వహించే డ్రైవ్‌లో టెన్త్ నుంచి డిగ్రీ వరకు చదివిన నిరుద్యోగులు హాజరుకావచ్చునని ప్రసూన తెలిపారు.

అండర్ పాస్ వంతెన నిర్మించాలి

ఆకివీడు: స్థానిక 14వ వార్డులోని జవహర్‌పేటలో రైల్వే ట్రాక్‌కు అండర్ పాస్ వంతెన నిర్మించాలని సీపీఎం డిమాండ్ చేసింది. వార్డులో శుక్రవారం పార్టీ వార్డు మహాసభ నిర్వహించారు. ఇటీవల మృతి చెందిన సీపీఎం సీనియర్ నాయకులు సీతారాం ఏచూరి, ఆర్.సత్యనారాయణరాజులకు నివాళులర్పించారు. సభలో పట్టణ కమిటీ కార్యదర్శి కె.తవిటినాయుడు మాట్లాడుతూ ప్రజా అవసరాల్ని పెడచెవిన పెట్టి, పాలకులు పెత్తందార్ల కోసం పని చేస్తున్నారని ఆరోపించారు. రోడ్డు ఆక్రమణల తొలగింపులో పేదలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు పెరిగిపోవడంతో సామాన్యులు బ్రతకలేని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజల్ని మభ్యపెట్టేవిధంగా సంక్షేమ పథకాల్ని ప్రకటించి, అమలులో చిత్తశుద్ధి వహించడం లేదని ఆరోపించారు. ప్రజా సమస్యలను పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాలని నాయకులు డోకల లక్ష్మి, ఎస్కే వల్లీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బీవీ వర్మ, సందక సూరిబాబు, జి.రాంబాబు, పాల్గొన్నారు.